క్లుప్తంగా

ఇఫ్తార్ విందు



కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి హమాలీ క్వాటర్స్‌లో ఉన్న నూరుల్ హయాత్ మసీదులో మంగళవారం ఏర్పాటు చేసిన ముస్లింల ఇఫ్తార్ విందులో వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



ఉపాధ్యాయులకు సరుకులు అందజేస్తున్న జుబేర్ సుల్తాన్

కదిరి అర్బన్: ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకుని పట్టణంలోని బటర్ ఫ్లై ప్రైవేట్ పాఠశాలలో మంగళవారం ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్ (పీఎల్‌టీయూ) రాష్ట్ర కో కన్వీనర్ జుబేర్ సుల్తాన్ 200 మంది ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే కొంతమంది ఉత్తమ ప్రైవేట్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్‌కు తనవంతు సాయంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో చంద్ర, విజయ భాస్కర్, జంషీద్, ఇబ్రహీం, రవీంద్రతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఫ్యాను గుర్తుకు ఓటేయండి



ఫ్యాను గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న నాయకులు

తలుపుల: ఉడమలకుర్తి పంచాయతీ పరిధిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, నాయకులు వెంకటపతి నాయుడు, బ్రహ్మానందరెడ్డి, బయపురెడ్డితో కలిసి ఉడమలకుర్తి, ఎలగలబైలు, సోమాలవాండ్లపల్లి, ఇందుకూరిపల్లి, అక్కిసానిపల్లి, చిన్నపల్లి,కాలనీ, బండమీద కొత్తపల్లి గ్రామాల్లో ఇంటింటా తిరిగి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్, హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మలను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రఘు, రామచంద్ర, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.


టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: రెడ్డిపల్లి పంచాయతీ తిప్పయ్యగారిపల్లికి చెందిన పలువురు టీడీపీ నాయకులు మంగళవారం ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వెంకటరంగ, ఎల్.శ్రీనివాసులు, ఎల్.శ్రీకాంత్, విజయ్‌కుమార్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాలే మహేశ్వర్‌రెడ్డి, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



ఉత్తన్న మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మక్బూల్ అహ్మద్

కదిరి అర్బన్: కాళసముద్రం గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఉత్తన్న అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందారు. పార్టీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ మంగళవారం గ్రామానికెళ్లి ఉత్తన్న మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయన వెంట ఎంపీపీ అమరనాథ్ రెడ్డి, నాయకులు శ్రీనివాసులు, బికారి సాబ్, బాబ్జాన్, ఇబ్రహీం, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది సంబరం

- ప్రతి ఇంటా పండుగ సందడి
- బంధుమిత్రులతో కళకళ
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- సరదా ఆటలతో సంతోషం



కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ధర్మవరం అర్బన్/ బత్తలపల్లి/ తాడిమర్రి/కదిరి టౌన్: క్రోధినామ సంవత్సరంలో వచ్చిన తొలి పండుగ ఉగాదిని ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు. ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో హిందువుల ఇళ్లు మామిడాకుల తోరణాలతో కళకళలాడాయి. బంధుమిత్రులతో పలు ఇళ్లు సందడిగా మారాయి. తెల్లవారుజాము నుంచే స్నానాలాచరించి, నూతన వస్త్రాలు ధరించి, ఇళ్లల్లో పూజలు చేసి, ఉగాది పచ్చడి స్వీకరించి.. పిండివంటలు ఆరగించి సంతోషంగా గడిపారు. అనంతరం ఉల్లాసంగా, ఉత్సాహంగా మహిళలు ఉయ్యాలలూగగా.. పురుషులు టెంకాయ, రాళ్ల పందేలు ఆడుతూ సరదాగా గడిపారు.

- ధర్మవరం పట్టణంలోని కొత్తపేట వేంకటేశ్వర స్వామి, షిరిడి సాయిబాబా ఆలయం, శ్రీనివాసనగర్ వెంకటేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరిదేవి, దుర్గమ్మదేవి, చెన్నకేశవస్వామి, లింగాశెట్టిపాళ్యం ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు వెళ్లి తమ మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో అర్చకులు పంచాంగం వినిపించారు.
- మండల కేంద్రమైన బత్తలపల్లిలోని శ్రీలలితా త్రిపుర సుందరీ సమేత శ్రీఓంకారేశ్వర స్వామి ఆలయంలోని ఓంకారేశ్వరునికి, కొల్లాపురమ్మ, బళ్లారి దుర్గమ్మ, అంకాలమ్మ, గంగమ్మ ఆలయాల్లోనూ, పోట్లమర్రిలోని మల్లేశ్వరాలయం, ఆంజనేయ స్వామి, నలలమ్మ ఆలయాలు, ముష్టూరులోని ఆంజనేయస్వామి, శివాలయాలు, గంటాపురం అప్పస్వామి, మాల్యవంతం, రామాపురం వీరనారాయణ స్వామి దేవాలయల్లో, డి.చెర్లోపల్లిలోని సిద్దేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాలయం, సంఘమేశ్వర క్షేత్రం, కాటికోటేశ్వరక్షేత్రాలతో పాటు వివిధ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.
- తాడిమర్రి, కునుకుంట్ల, నిడిగల్లు, ఎం.అగ్రహారం, పెద్దకోట్ల, చిల్లకొండయ్యపల్లి, దాడితోట, చిల్లవారిపల్లి తదితర గ్రామాలో ప్రజలు ఉగాది పండుగను ఘనంగా జరుపు కున్నారు. తెలుగు సంప్రదాయానికి ప్రతీకగా జరుపుకునే పండుగ రోజున మహిళలు తెల్లవారు జామున నిద్రలేచి తలంటు స్నానం చేసి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. చిల్లవారిపల్లి శ్రీకాటికోటేశ్వర క్షేత్రం, చిల్లకొండయ్యపల్లి, కునుకుంట్ల గ్రామాల్లో శివాలయం, తాడిమర్రిలోని పురాతన శివాలయం, లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం, ఓబులేసుని స్వామి ఆలయలం, ఏకపాదంపల్లి, నార్శింపల్లి గ్రామాల్లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు.
- కదిరి పట్టణంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, శివాలయం, మరకత మహాలక్ష్మి ఆలయం, వాసవీ మాత, చౌడేశ్వరి ఆలయం, సైదాపురం అంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు దీపాలు వెలుగించి మొక్కులు తీర్చుకున్నారు.



బత్తలపల్లిలో పూజలందుకున్న కొల్లాపురమ్మ



బత్తలపల్లిలో ఓంకారేశ్వరుడు



ధర్మవరంలో పంచాంగం చెబుతున్న అర్చకులు



పోట్లమర్రిలో విశేష పూజలందుకున్న ఆంజనేయస్వామి



ధర్మవరంలో ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి

ఊరూరా ఉగాది సందడి

కనగానపల్లి: ఉగాది సందర్భంగా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. తెలుగువారి తొలి పండుగ ఉగాది పర్వదినాన్ని మంగళవారం రాప్తాడు నియోజకవర్గవ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రోధి నామ సంవత్సరానికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. పండుగ సందర్భంగా ప్రతి గ్రామంలోను ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు పండుగవేళ ఉదయాన్నే లేచి ఇంటి ముఖద్వారాలకు పచ్చని మామిడి తోరణాలు కట్టి అందంగా అలంకరించారు. దీంతో పాటు గ్రామాల్లోని రైతులు పంటలు బాగా పండి, మంచి శుభాలు జరగాలని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని పెదయ్యస్వామి, ఈశ్వరాలయం, సల్లాపురమ్మ, మామిళ్లపల్లిలోని నరసింహస్వామి, పెద్దమ్మ, దుర్గమ్మ, గంగమ్మ ఆలయాలు, తగరకుంట సీతారామాంజనేయస్వామి, మల్లన్నస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు స్వాములను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



కనగానపల్లి మండలం మామిళ్లపల్లిలో పూజలందుకున్న అమ్మవారు

పేకాట స్థావరంపై దాడులు

కదిరి అర్బన్: కాలేపల్లి రైల్వేగేట్ సమీపంలో మంగళవారం పేకాట స్థావరంపై రూరల్ అప్‌గ్రేడ్‌స్టేషన్ సీఐ మోహన్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 4 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

పౌర్ణమి వేడుకలకు ఆలయాల ముస్తాబు

తాడిమర్రి: ఉగాది మరుసటి రోజున జరిగే పౌర్ణమి వేడుకలకు అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. తాడిమర్రి, నార్శింపల్లి, కునుకుంట్ల, దాడితోట గ్రామాల్లోని పెద్దమ్మ తల్లి ఆలయాలు, పెద్దకోట్ల, తాడిమర్రిలోని చౌడేశ్వరిదేవి ఆలయాలు, తాడిమర్రి, దాడితోట గ్రామాల్లోని అంకాలమ్మ ఆలయాలు, కునుకుంట్లలోని యల్లమ్మ, ఓసూరమ్మ ఆలయాలు సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు అమ్మవారి ఆలయాల్లో కోళ్లు, పొట్టేళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దాతలు

ధర్మవరం అర్బన్: ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని యువర్స్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. గుండా నారాయణస్వామి జ్ఞాపకార్థం వారి కుమారుడు గుండా నాగరాజు, సిద్ధి రాజేష్ శిల్క్స్ సహకారంతో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి బండి నాగేంద్ర, సభ్యులు చాంద్‌బాషా, సత్రశాల మల్లికార్జున, బాబు, ఆర్టీసీ డిపో అధికారులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అమడగూరు: గొల్లపల్లి చెక్‌పోస్ట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 1,152 కర్ణాటక మద్యం ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ మగ్బూల్‌బాషా మాట్లాడుతూ కర్ణాటక బోయపల్లికి చెందిన చంద్రప్ప ద్విచక్రవాహనంలో అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కొత్తచెరువులో టీడీపీకి షాక్





వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- 252 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

కొత్తచెరువు: మండల కేంద్రం కొత్తచెరువులో టీడీపీకి గట్టి షాక్ తగిలింది. బీసీ కాలనీలో 252 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. మంగళవారం ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వారంతా వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన నచ్చి తాము పార్టీలో చేరినట్లు వెల్లడించారు. పార్టీలోకి చేరిన వారిలో ఆంజనేయులు, లింగమయ్య, శీనా, లక్ష్మన్న, పసలబోట్ల నారాయణ, గంగన్న, వెంకటప్ప, రాజు, డ్రైవర్ గంగన్న, సాయికుమార్, రామంజి, సుబ్రహ్మణ్యం, నరేంద్ర, గోపాల్, శంకరయ్య, వేపమాను వెంకటేష్, వెంకటలక్ష్మి, నాగేంద్ర, రాము తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో జగనన్న పాలన, సంక్షేమ పథకాల అమలు తీరు నచ్చి వివిధ పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు.

విమర్శించిన పార్టీలతోనే బాబు పొత్తులు

టీడీపీ అధినేత చంద్రబాబు ఇవే తన జీవితంలో చివరి ఎన్నికలని భావించి.. అధికారంలోకి రావడం కోసం విమర్శించిన పార్టీలతో పొత్తులు పెట్టుకున్నారని ఎమ్మెల్యే దుద్దుకుంట ఎద్దేవా చేశారు. ఓట్ల కోసం తప్పుడు హామీలు ఇచ్చేందుకు సిద్ధమయ్యాడని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారేపల్లి జగన్‌మోహన్‌రెడ్డి, ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకులు అంగడి సోమశేఖర్‌రెడ్డి, దాల్‌మిల్ సూరి, టౌన్ కన్వీనర్ భాస్కర, సర్పంచ్ రాధా నాగరాజు, ఉపసర్పంచ్ యుగంధర్, షానోసేత్, చంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

'బలవంతంగా టీడీపీ కండువా వేశారు'

గాండ్లపెంట: తన సమ్మతం లేకుండా టీడీపీ నాయకులు నా మెడలో కండువా వేశారని కటారుపల్లి వైఎస్సార్‌సీపీ కార్యకర్త అన్వర్‌బాషా స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. సోమవారం టీడీపీ నాయకులు కటారుపల్లిలో ఎన్నికల ప్రచారానికి వచ్చారన్నారు. తన కిరాణా షాపు వద్దకు వచ్చినపుడు టీడీపీ నాయకుల్లో ఇస్మాయిల్ తనకు పరిచయం ఉండటంతో.. ఆయన ఉన్న పళంగా తన మెడలో కండువా వేశారని, తర్వాత తాను టీడీపీలో చేరినట్లుగా ప్రచారం చేసుకున్నారని తెలిపారు. జరిగిన విషయాన్ని వైఎస్సార్‌సీపీ మండల నాయకుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్ సమక్షంలో తిరిగి వైఎస్సార్‌సీపీ కండువా వేయించుకున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానికి శాయశక్తులా కృషి చేస్తానని స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు ఇకనైనా దిగజారుడు రాజకీయాలు చేయడం మానుకుంటే మంచిదని హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఫయాజ్ అలీ, శ్రీకాంత్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, ఇక్బాల్, కటారుపల్లి, నాయకులు హరిప్రసాద్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, సుధీర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మక్బూల్ అహ్మద్ సమక్షంలో తిరిగి వైఎస్సార్‌సీపీ కండువా వేసుకున్న అన్వర్‌బాషా

సాయం చేయడంలోనే సంతృప్తి



కోడేకండ్లలో ఫాదర్ జయంతి సందర్భంగా చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న ఆర్డీ ప్రమీల

బత్తలపల్లి: సాయం చేయడంలోనే సంతృప్తి కలుగుతుందని ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ) ప్రమీల, ఏటీఎల్ రుక్మాంగద అన్నారు. తోటి మనుషులకు సాయపడటం, మంచి పని చేయడం ద్వారా ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌కు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని అన్నారు. మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోడేకండ్ల, ఈదుల ముష్టూరులో జరిగిన ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి సమావేశాలకు ఆర్డీటీ ఆర్డీ, ఏటీఎల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బత్తలపల్లి మండలంలో ఫాదర్ జయంతి వేడుకలను ప్రజలు స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నారన్నారు. 3,100 హుండీలను ప్రజలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. గత ఏడాది హుండీల ద్వారా రూ.14 లక్షలు వచ్చినట్లు తెలిపారు. వాటిని పేద ప్రజలకు, అనాథలకు వెచ్చించామని వివరించారు. ఈ ఏడాది 1,099 హుండీల ద్వారా రూ.6 లక్షలు వచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో 'స్పందించు- సాయం అందించు' హుండీలను పంపిణీ చేశారు. అంతకు ముందు ఆయా గ్రామాల్లోని ప్రజలు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, మాంఛో ఫెర్రర్ చిత్ర పటాలను ఊరేగించారు. సంజీవపురం వద్ద ఫాదర్ విగ్రహం ముందు బర్త్‌డే కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో ఆర్డీటీ సంఘాలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫాదర్ ఫెర్రర్ సేవలు మరువలేనివి

కనగానపల్లి: బలహీన వర్గాల కోసం ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చేసిన సేవలు మరువలేనివని ఆర్డీటీ ఎస్‌టీఎల్‌లు శారదమ్మ, ఎల్లమ్మ తెలిపారు. మంగళవారం మండలవ్యాప్తంగా ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతిని నిర్వహించారు. ముక్తాపురంలో ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి ఆర్డీటీ ప్రతినిధులతో కలసి స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్డీటీ మహిళా సంఘాలు స్పందించు- సాయమందించు కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. కోనాపురం, వేపకుంట, మద్దులచెరువు, పర్వతదేవరపల్లి, శివపురంలో కూడా ఫాదర్ అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో సీఓ రామక్రిష్ణ, పీఎస్‌సీ సభ్యులు నరసింహమూర్తి, లక్ష్మినరసమ్మ, చెన్నమ్మ, లక్ష్మీదేవి, నాగవేణి, తదితరులు పాల్గొన్నారు.



ముక్తాపురంలో ఫాదర్ ఫెర్రర్‌కు నివాళులు

కవులకు సన్మానం

కొత్తచెరువు: కొత్తచెరువు వాసవి కల్యాణ మండపంలో ఉగాది పండుగను పురస్కరించుకుని మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయసంఘం ఆధ్వర్యంలో కవులకు సన్మానం చేశారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ విద్యాశాఖాధికారి మునెయ్య, సమరసత సేవా సంస్థ అధ్యక్షులు సుధాకర్ విచ్చేసి కవుల గొప్పతనం, ఉగాది విశిష్టత తెలియజేశారు. అనంతరం కవులు మాణిక్యం ఇసాక్, కొండసాని, రజితలను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు అమర చంద్ర, కార్యదర్శి సురేష్, రాధాకృష్ణ, ఉపాధ్యాయులు జనార్ధన,సుధాకర,బాబు, మాధవీలత తదితరులు పాల్గొన్నారు,

చంద్రబాబు హామీలు నమ్మొద్దు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్



ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్

కదిరి అర్బన్: టీడీపీ అధినేత చంద్రబాబు హామీలు నమ్మి మోసపోవద్దని వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ ఓటర్లకు సూచించారు. మంగళవారం ఆయన కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ పరిధిలోని మరువతండా, మిద్దెవారిపల్లి, మూలపల్లి తండా, గంగన్నగారిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ కనీస బడ్జెట్ అంచనా వేయకుండా చంద్రబాబు 'సూపర్ సిక్స్' పేరుతో హామీలు ఇవ్వడం.. వాటిని నెరవేర్చలేమన్న భయంతో తిరిగి ప్రజా మేనిఫెస్టో ప్రకటిస్తామని ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. చంద్రబాబు మాయలో పడితే ఐదేళ్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు సాధించుకోవచ్చని తెలిపారు. నవరత్నాల కంటే మెరుగైన పథకాలు ఈసారి ప్రకటించనున్నారని చెప్పారు. ఎన్ని పార్టీలు జతకట్టినా ప్రజలు మాత్రం జగన్‌కే బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. వైఎస్సార్‌సీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తల వెంకటరమణ, లీగల్‌సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వరెడ్డి, జెడ్పీటీసీ రాధాకృష్ణానాయక్, రూరల్ మండల కన్వీనర్ ప్రకాష్, సర్పంచ్ శాంతాబాయ్, జేసీఎస్ కన్వీనర్ లింగాల మధుసూదన్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్, నాయకులు మధుకర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.